www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 11 సెప్టెంబరు 2023

5

పశ్చిమ గోదావరి



పాఠశాలలకు నిధులు మంజూరు చేయాలి

ఎపిటిఎఫ్ జిల్లా కన్వీనర్ రమణ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, మిగిలిన పాఠశాలలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా కన్వీనర్ రమణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలలకు నిధులు మంజూరు కాకపోవడంతో పాఠశాలల నిర్వహణా భారం ప్రధానోపాధ్యాయులపై పడుతుందని పేర్కొన్నారు. పలు పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపు, పాఠశాలల సామగ్రి, స్టేషనరీ కొనుగోలు, పాఠశాలలో వివిధ కార్యక్రమాల నిర్వహణ, నీటి వసతికి సంబంధించి మైనర్ రిపేర్లు, తల్లిదండ్రుల సమావేశాలు వంటి ఖర్చులు భారంగా మారాయని తెలిపారు. ప్రభుత్వం పాఠశాలలకు నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే అన్ని పాఠశాలలకు పాఠశాల నిధులను మంజూరు చేయాలని కోరారు.

హైఅలర్ట్

చంద్రబాబుకు రిమాండ్ నేపథ్యంలో ఖాకీలు అప్రమత్తం

భారీ సంఖ్యలో పోలీసుల మోహరింపు

జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలు

టిడిపి ఎంఎల్ఎలు, ముఖ్యనేతల ఇళ్లు, ఆఫీసుల వద్ద పెద్దసంఖ్యలో బలగాలు

నేడు రాష్ట్ర బంద్‌కు టిడిపి పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎసిబి కోర్టు రిమాండ్ విధించిన నేపథ్యంలో జిల్లా అంతటా హైఅలర్ట్ నెలకొంది. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు ప్రధాన కూడళ్లలో పెద్దసంఖ్యలో మోహరించారు. ఎటువంటి అనుమతులూ లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో శనివారం ఉదయం నుంచి టిడిపి నేతలు వివిధ రూపాల్లో నిరసనలు, ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. కొన్ని ప్రాంతాల్లో నల్ల బ్యాడ్జీలు, నల్లజెండాలతో నిరసన ర్యాలీలు చేపట్టారు. ఇదిలా ఉంటే జిల్లావ్యాప్తంగా ఆదివారం టిడిపి ఆధ్వర్యాన నిరసన దీక్షలు చేపట్టారు. భీమవరం, ఉండి, పాలకొల్లు, నరసాపురం, తణుకు తదితర ప్రాంతాల్లో టిడిపి శ్రేణులు నిరసన దీక్షలు చేపట్టారు. కొన్నిచోట్ల పోలీసులు అడ్డుకున్న ఘటనలూ ఉన్నాయి. ఎసిబి కోర్టు రిమాండ్ తిరస్కరిస్తుందని టిడిపి నేతలు ఆశించినా దానికి భిన్నంగా కోర్టు ఉత్తర్వులు ఉండటంతో టిడిపి శ్రేణులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నాయి. దీంతో జిల్లావ్యాప్తంగా టెన్షన్ వాతావరణం ఏర్పడింది. దీంతో జిల్లా కేంద్రమైన భీమవరంలో పోలీసులు భారీగా మోహరించారు. భీమవరంలో ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు నివాసం వద్ద, టిడిపి జిల్లా కార్యాలయం వద్ద పెద్దసంఖ్యలో బలగాలు రంగంలోకి దిగాయి. ప్రధాన కూడళ్లలో పోలీసులు గస్తీ చేపట్టారు.



వీరవాసరం సెంటర్‌లో మోహరించిన పోలీసులు

శాంతియుత నిరసనలు సాగిస్తాం

ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు

తమ అధినేత చంద్రబాబుకు రిమాండ్ విధించిన నేపథ్యంలో సోమవారం నుంచి శాంతియుతంగా నిరసన కొనసాగిస్తామని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు స్పష్టం చేశారు. కోర్టు తీర్పు వెలువడిన తర్వాత భీమవరంలో ఉన్న ఆయన ఇంటి వద్ద ఎంఎల్ఎ రామరాజు మీడియాతో మాట్లాడారు. చట్టాలపై తమకు గౌరవం ఉందని న్యాయ పోరాటం చేస్తామన్నారు. కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు.

నేడు రాష్ట్ర బంద్‌కు పిలుపు

చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌ను నిరసిస్తూ సోమవారం రాష్ట్ర బంద్‌కు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లాలో బంద్ విజయవంతానికి నేతలు సమాలోచనలో మునిగారు. అదే సమయంలో బంద్‌ను విఫలం చేయడానికి పోలీసులు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఏదేమైనా బంద్ విజయవంతం చేసి ప్రభుత్వ వైఖరిపై తమ నిరసన తెలుపుతామని టిడిపి నేతలు చెబుతున్నారు.

అగ్రిమెంట్లు అమలు చేస్తారా..!

మొక్కజొన్న సీడ్స్ సాగులో కంపెనీల ఇష్టారాజ్యం

ప్రతియేటా నష్టాలతో రైతుల ఆత్మహత్యలు

నష్ట పరిహారం ఇవ్వకుండా సీడ్స్ కంపెనీల నిర్లక్ష్యం

తామేమీ చేయలేమంటున్న వ్యవసాయాధికారులు

ఈ ఏడాదైనా రైతులకు మేలు జరిగేలా చర్యలుండేనా?



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మొక్కజొన్న సీడ్స్ కంపెనీలు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు సాగుతోంది. రైతులను నిలువునా మోసగిస్తున్నా అడిగే నాథుడే లేకుండాపోయాడు. తమకు ఏమాత్రం సంబంధం లేదన్నట్లు వ్యవసాయాధికారులు వ్యవహరిస్తున్నారు. దీంతో నాణ్యత లేని సీడ్స్‌తో నష్టపోయిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు జిల్లాలో నిత్యకృత్యంగా మారుతున్నాయి. ఈ నెలాఖరు నుంచి మొక్కజొన్న సాగు ప్రారంభం కానుంది. గతంలో మాదిరిగా కాకుండా సీడ్స్ సాగు చేస్తున్న రైతులకు నష్టం వాటిల్లితే కంపెనీలు పరిహారం ఇచ్చేలా సంస్థలు అగ్రిమెంట్లు చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సీడ్స్ కంపెనీలపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఏలూరు జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగు సాగుతోంది. మొక్కజొన్న సాగులో సీడ్స్ సాగు, కమర్షియల్ సాగు అనే రెండు రకాల పద్ధతుల్లో రైతులు సాగు చేస్తారు. ఏలూరు జిల్లాలో 70 వేల ఎకరాల్లో కంపెనీల మొక్కజొన్న సీడ్స్‌ను రైతులు సాగు చేస్తున్నారు. మొక్కజొన్న సీడ్స్ సాగులో విత్తన కంపెనీల ప్రతినిధులే రైతుల వద్దకు వెళ్లి తమ సీడ్స్ సాగు చేయాలని ఇస్తారు. దిగుబడి ఎంత వస్తుంది, ఏయే రకాల సస్యరక్షణ చర్యలు తీసుకోవాలో కూడా కంపెనీల ప్రతినిధులే రైతులకు వివరిస్తారు. పండిన పంటను రైతుల నుంచి కంపెనీలే కొనుగోలు చేస్తాయి. కమర్షియల్ సాగులో మాత్రం రైతులు విత్తనం కొనుగోలు చేసుకుని సాగు చేస్తారు. కమర్షియల్ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. సీడ్స్ సాగులోనే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. కంపెనీల్లో తమ సీడ్స్‌ను ట్రయల్ పద్ధతిలో రైతులకు అందించి సాగు చేయిస్తున్నారు. దిగుబడి వస్తే తమ సీడ్స్ గొప్ప అన్నట్లు చెబుతున్నారు. దిగుబడి రాకపోతే మాత్రం రైతులదే తప్పన్నట్లు మాట్లాడి గాలికొదిలేస్తున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్న రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నూజివీడు నియోజకవర్గంలో ఇదేవిధంగా గతేడాది రైతు ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడం వల్లే సీడ్స్ కంపెనీలు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి.

అగ్రిమెంట్ నిబంధనలు అమలు చేయరా..!

సీడ్స్ కంపెనీలు తమ విత్తనాన్ని రైతులకు అందించేటప్పుడు నిబంధనల ప్రకారం అగ్రిమెంట్లు రాయాల్సి ఉంటుంది. అగ్రిమెంట్‌లో సీడ్స్ విత్తనంతో నష్టం వాటిల్లితే రైతులకు నష్టపరిహారం ఇచ్చేలా పొందుపర్చాల్సి ఉంది. అయితే జిల్లాలో ఎక్కడా అగ్రిమెంట్ల నిబంధన అమలు కావడం లేదు. అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. దాదాపు దశాబ్దకాలంగా రైతులు పోరాటం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. అగ్రిమెంట్ లేకపోవడంతో సీడ్స్ పంట దెబ్బతింటే రైతులకు కంపెనీలు ఎటువంటి నష్టపరిహారమూ ఇవ్వడం లేదు. దీంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. నాణ్యమైన సీడ్స్ ఇవ్వని కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. దీంతో సీడ్స్ కంపెనీలు మరింత రెచ్చిపోతున్నాయి. ఈ ఏడాదైనా అగ్రిమెంట్లు రాసేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రతి గ్రామంలోనూ రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయి. రైతుభరోసా కేంద్రాల్లో పని చేసే అధికారుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటే మొక్కజొన్న రైతులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. సమగ్ర విత్తన చట్టం లేకపోవడం కారణంగా విత్తన సంస్థలు ఈ విధంగా రెచ్చిపోతున్నాయంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. జిల్లా అధికారులు మొక్కజొన్న రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారో.. లేదో వేచిచూడాలి.

సీడ్స్ కంపెనీలపై ప్రభుత్వ అజమాయిషీ ఉండేలా చర్యలు చేపట్టాలి

నిమ్మగడ్డ నరసింహ, ఎపి రైతుసంఘం నేత

మొక్కజొన్న సీడ్స్ కంపెనీలపై ప్రభుత్వ అజమాయిషీ లేకుండాపోయింది. సీడ్స్ అందించే కంపెనీలు రైతులకు రాతపూర్వక అగ్రిమెంట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. రైతుభరోసా సహాయకులతో పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలి. సీడ్స్ పంట దెబ్బతింటే ప్రభుత్వ అధికారులే బాధ్యత తీసుకుని రైతుకు న్యాయం జరిగేలా చూడాలి. త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో సమగ్ర విత్తన చట్టం తీసుకురావాలి.

ఆంక్షలు, అడ్డంకుల నడుమ టిడిపి దీక్షలు

ప్రజాశక్తి - తణుకు

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు ఆదివారం సామూహిక నిరసన దీక్ష చేపట్టారు. తొలుత రాష్ట్రపతి రోడ్డులో కోర్టు ఎదురుగా నిరసన దీక్ష చేపట్టారు. అయితే పోలీసులు అక్కడ దీక్షకు అనుమతి నిరాకరించి రాధాకృష్ణతోపాటు టిడిపి నేతలను అరెస్టు చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలోనే టిడిపి శ్రేణులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ స్థానిక సిఐ స్థానిక మంత్రికి తొత్తుగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వాలు శాశ్వతం కాదని, అధికార పక్షానికి, ప్రతిపక్షానికి సమన్యాయం అధికారులు పాటించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, నాయకులు బసవ రామకృష్ణ, పరిమి వెంకన్నబాబు, ఆనాల ఆదినారాయణ, గోపిశెట్టి రామకృష్ణ, పుప్పాల ఇందిరాదేవి, దూలం చిట్టిపాప, మేడపాటి కృష్ణకుమారి పాల్గొన్నారు.



తణుకులో

పాలకొల్లు: టిడిపి ఆధ్వర్యాన రిలే నిరాహారదీక్షలు స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం ప్రారంభించారు. ఈ దీక్షలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావుతోపాటు సుమారు వంద మంది కార్యకర్తలు పాల్గొన్నారు. గాంధీబొమ్మ సెంటర్‌లో దీక్షలు చేపట్టడానికి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో ఎంఎల్ఎ కార్యాలయం వద్ద దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, కర్నేన గౌరునాయుడు, కడలి గోపీ, బోణం నాని, మామిడిశెట్టి పెద్దిరాజు, మాతా రత్నరాజు, చిట్టూరి రామాంజనేయులు పాల్గొన్నారు. ఉదయం నుంచి ఎంఎల్ఎ ఇంటి వద్ద పాలకొల్లు, పెనుగొండ సిఐలు డి.రాంబాబు, నాగేశ్వరరావు, పలువురు ఎస్ఐల ఆధ్వర్యాన ప్రత్యేక పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహించారు.



పాలకొల్లులో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

నల్ల జెండాలతో నిరసన

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పాలకొల్లు గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఆదివారం టిడిపి నేతలు నల్ల జెండాలతో నిరసన తెలిపారు. చంద్రబాబును బేషరతుగా విడిచిపెట్టే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, కర్నేన గౌరునాయుడు, పాలవలస తులసీరావు, కర్నేన రోజారమణి, కోడి విజయభాస్కర్, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, పెన్మెత్స రామభద్రరాజు, మామిడిశెట్టి పెద్దిరాజు, మహ్మద్‌జానీ, బోణం నాని పాల్గొన్నారు. రూరల్ సిఐ కె.శ్రీనివాస్ సారధ్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మొగల్తూరు: టిడిపి మండల నాయకులను పోలీసులు ఆదివారం గృహనిర్బంధం చేశారు. టిడిపి అధిష్టానం రిలే నిరాహార దీక్షలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో వాటిని అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. టిడిపి మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, ఆ పార్టీ నాయకులు పలువురిని ఇళ్ల నుంచి బయటకు రాకుండా గృహనిర్బంధం చేశారు.

పోడూరు: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ కవిటం సెంటర్ వద్ద టిడిపి నేతలు ఆదివారం ఉదయం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. కొద్దిసేపటికే పోడూరు ఎస్ఐ రామ్‌కుమార్ దీక్షను భగ్నం చేసి నేతలను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో స్టేషన్‌లోనే నేతలు దీక్ష కొనసాగించారు. కార్యక్రమంలో ఆచంట జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, టిడిపి మండలాధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, గణపతినీడి రాంబాబు, రమేష్‌రాజు, దొంగ సూర్యప్రసాద్, రుద్రరాజు సుబ్రహ్మణ్యరాజు, బొక్కా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉండి: చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు చేపట్టిన దీక్షకు మద్దతుగా టిడిపి మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా కరిమెరక నాగరాజు మాట్లాడగా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భీమవరంలో


భీమవరం రూరల్: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ రెండో రోజు ఆదివారం భీమవరంలో నిరసనలు సాగాయి. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్ధసారథి ఆధ్వర్యంలో ఆదివారం దీక్ష చేపట్టారు. తొలుత వీరమ్మ చెరువు పార్క్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద దీక్ష నిర్వహణకు నేతలు సిద్ధమయ్యారు. అయితే పోలీసులు అనుమతులు నిరాకరించడంతో పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఉదయం తొమ్మిది గంటలకు టిడిపి నాయకులు దీక్ష చేపట్టారు. ఈ దీక్షను టిడిపి లీగల్‌సెల్ రాష్ట్ర కమిటీ సభ్యులు వేండ్ర శ్రీనివాస్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి వైస్ ఛైర్మన్ చెల్లబోయిన సుబ్బారావు, బిసి సెల్ నాయకులు గంటా త్రిమూర్తులు, ఎద్దు ఏసుపాదం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ఆధ్వర్యంలో గొర్రెల శ్రీధర్ కాంప్లెక్స్ వద్ద రిలే నిరాహారదీక్ష నిర్వహించారు. పోలీసు ఐల్యాండ్ వద్ద దీక్ష చేపట్టేందుకు టిడిపి నేతలు సిద్ధమవ్వగా పోలీసులు అనుమతి నిరాకరించడంతో భీమవరం రోడ్డులోని గొర్రెల శ్రీధర్ కాంప్లెక్స్ వద్ద దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నేతలు పరిమి రవికుమార్, గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పెదతాడేపల్లి సర్పంచి పోతుల అన్నవరం, పాతూరి రామప్రసాద్ చౌదరి, గంధం సురేష్, షేక్ బాజి, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నేతలు వాతాడ ఉమామహేశ్వరరావు, శంకరపు వెంకటేశ్వరరావు, ముసుకూడి రవి, దొంగ పద్మారావు, శీలం హరికృష్ణ, చెలుబోయిన వాసు, పెండ్ర శ్రీను, ఎమ్.డి.మౌలాలిఖాన్, దొంగ శ్రీరామచంద్రుడు, వేగి కుమార్, తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మొగల్తూరులో గుబ్బల నాగరాజు గృహ నిర్బంధం



తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న మల్లికార్జునరావు



నరసాపురంలో దీక్షలు

ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన దీక్ష

ప్రజాశక్తి - భీమవరం

తమ సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. జిల్లాలో సమగ్ర శిక్షలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ప్రకాశంచౌక్‌కు చేరుకుని అక్కడ నిరసన దీక్ష చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్ట్ ఉద్యోగులు మాట్లాడుతూ ప్రభుత్వంలో వివిధ యాజమాన్యాల్లో పని చేస్తున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లను స్కూల్ ఎడ్యుకేషన్‌లో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో వివిధ విభాగాల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న అందరికీ సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగికీ వారి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని కోరారు. రిటైర్‌మెంట్ వయస్సును పర్మినెంట్ ఉద్యోగుల వలె 62 ఏళ్లకు పెంచి, రూ.20 లక్షలు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇఎస్ఐ, ఇపిఎఫ్ సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగికి వారు పని చేస్తున్న విభాగం నుంచి జాబ్‌ఛార్ట్ అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల ప్రెసిడెంట్ బి.శ్రీనివాస్, సిఆర్ఎమ్‌డి ప్రెసిడెంట్ ఆనంద్, జిల్లా ముఖ్య నాయకులు ఎం.బాలరాజు, బి.రవిప్రసాద్, పి.సుబ్బారావు, టి.చిట్టి, టి.చినబాబు, పి.వినయ్, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.



నినదిస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు

జాతీయ లోక్‌అదాలత్‌లో 9901 కేసులు పరిష్కారం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ పురుషోత్తమకుమార్

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల తొమ్మిదో తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా 9901 కేసులు పరిష్కరించినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి జి.రాజేశ్వరి తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 33 బెంచీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏలూరులో ఎనిమిది బెంచీలు, భీమవరంలో ఐదు, కొవ్వూరులో నాలుగు, నరసాపురంలో మూడు, తణుకులో నాలుగు, తాడేపల్లిగూడెంలో మూడు, పాలకొల్లులో ఒకటి, నిడదవోలులో ఒకటి, జంగారెడ్డిగూడెంలో రెండు, చింతలపూడిలో ఒకటి, భీమడోలులో ఒకటి చొప్పున బెంచిలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9901 కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. వాటిలో 9485 క్రిమినల్ కేసులు, 65 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 183 సివిల్ కేసులను రాజీ చేయగా 168 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఏలూరులో 1876, భీమవరంలో 971, చింతలపూడిలో 513, జంగారెడ్డిగూడెంలో 887, కొవ్వూరులో 867, నరసాపురంలో 760, పాలకొల్లులో 601, తాడేపల్లిగూడెంలో 940, తణుకులో 1077, నిడదవోలులో 960, భీమడోలులో 449 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. కేసుల పరిష్కారానికి తోడ్పాడిన న్యాయవాదులకు, పోలీస్ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ ప్రతినిధులకు, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ వారికి, ఎపి ఎస్‌పిడిసిఎల్ అధికారులకు, జిల్లా పంచాయతీ శాఖ వారికి, పత్రిక విలేకరులకు, ఆల్ ఇండియా రేడియో విజయవాడ వారికి, రవాణాశాఖ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖ అధికారులకు, అడ్వకేట్ క్లర్కులకు, అగ్రికల్చరల్ అధికారులకు, మిగతా శాఖలఅందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

16న కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొబ్బరి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 16న రాజమండ్రిలో కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. ఏలూరు పవర్‌పేటలోని అన్నే భవనంలో కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సు కరపత్రాలను రైతు సంఘం నాయకులు ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన ఉదయం 10 గంటలకు రాజమండ్రి, గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ భవనం హాలులో సదస్సు జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుండి కొబ్బరి రైతులు ఈ సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కొబ్బరి రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

ఎకరా కొబ్బరి తోటకు రూ.60 వేలకుపైగా పెట్టుబడి అవుతోందని, చెట్టు నుండి కొబ్బరికాయ కోసి గుట్టగా పోయడానికి కాయకు రూ.మూడు ఖర్చవు తుందన్నారు. అయితే వ్యాపారులు ఎండు కొబ్బరికి కాయకు రూ.ఏడుకు మించి ధర ఇవ్వడం లేదన్నారు. కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాక కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విదేశాల నుండి కొబ్బరి ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం వల్లనే కొబ్బరి రైతులకు ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులు ఆపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కొబ్బరి రైతులకు ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేసి నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొబ్బరి రైతులకు కనీస ధర ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు అనుమోలు మురళీ, రైతులు పాల్గొన్నారు.


శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పోడూరు

జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జెసిఐ) పాలకొల్లు రైసింగ్ ఆధ్వర్యంలో ఆదివారం జిన్నూరు ఐడిఎల్ స్కూల్ ప్రాంగణంలో మహిళలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జెసిఐ పాస్ట్ జోనల్ ప్రెసిడెంట్ రాహుల్ వేదాంతం ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతిఒక్కరూ ఒత్తిడితో కూడిన జీవితాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవడం ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు తగిన వైద్యసేవలు అందుబాటులో ఉంచే లక్ష్యంతో తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు దంత వైద్య నిపుణురాలు డాక్టర్ మౌని కావలి, హెడ్, నెక్ సర్జన్ డాక్టర్ రుద్రరాజు జయదుర్గాదేవి, ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ ఉమాదేవి కావలి, స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ సుభాషిని, డాక్టర్ ప్రశాంతి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ జోనల్ వైస్ ప్రెసిడెంట్ మీనా మణిదీప్తి, ట్రెజరర్ సబిత, సభ్యులు కౌశిక్ శిరీష, నీలిమ, ప్రదీప్ విష్ణు, మురళీకృష్ణ, సుందరి, తరుణ్, సాయి, ఆచంట వెంకట సుబ్బారావు, వి.సదాశివమూర్తి పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్ఎ రామకృష్ణారావుకు సతీవియోగం

ప్రజాశక్తి- తణుకు

తణుకు మాజీ ఎంఎల్ఎ ముళ్లపూడి వెంకటకృష్ణారావు సతీమణి సతీమణి లక్ష్మి ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆదివారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని మాజీ ఎంఎల్ఎ రాధాకృష్ణ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటకృష్ణారావును పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. లక్ష్మి మృతి ఆమె కుటుంబానికి తీరని లోటన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు లక్ష్మి మృతి పట్ల సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.


వడ్డన చేస్తున్న నిర్వాహకులు

పలుచోట్ల అఖండ అన్నసమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి (చినగోపురం) దేవస్థానంలో ఆదివారం ఆళ్లవార్ల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి, టిటిడి సభ్యులు మేకా శేషుబాబు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద్‌ప్రకాష్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, చింతలపూడి పరిశీలకులు గుణ్ణం నాగబాబు, మాజీ ఎంఎల్ఎ బంగారు ఉషారాణి, పెద్దగోపురం ఛైర్మన్ కోరాడ శ్రీను, వెంకటేశ్వర ఆలయ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, ఆలయ మేనేజర్ పిటి.గోవిందరావు, సత్రం ఛైర్మన్ జవ్వాది పానకాలు, మామిడి బాబు, నంబూరి పవన్, ట్రస్టీలు కెల్లా భూలక్ష్మి దుర్గారావు, పొట్టిపాటి అన్నా రాణి, లక్ష్మీనారాయణశర్మ పాల్గొన్నారు.

పాలకొల్లు ఎర్ర వంతెన వద్ద ఉన్న శ్రీ కృష్ణుడి ఆలయంలో వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. గుడాల గోపి కార్యక్రమంలో పాల్గొని వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, ఉనికిల శ్రీనివాస్, కమిటీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


ముత్యాలమ్మ ఆలయంలో యాత్రికులు

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం యాత్రికులతో ఆదివారం కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి రామకబుష్ణంరాజు, పలువురు గ్రామస్తులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు


దగ్ధమైన వాటిని పరిశీలిస్తున్న ఫైర్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - పెనుమంట్ర

పొలమూరు అంబేద్కర్ కాలనీలో షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అంబేద్కర్ కాలనీకి చెందిన ఇంజే ఇజ్రాయిల్, అతని కుమారుడు ఇంజే నాగేశ్వరరావు, కోడలు ప్రేమకుమారి, ఇద్దరు చిన్నారులు ఒకే తాటాకింట్లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో వీరంతా ఆదివారం ఉదయం చర్చికి వెళ్లారు. తిరిగొచ్చిన కొంతసేపటికి సుమారు 11 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు పైకప్పు నుంచి మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంటిలో ఉన్న సామగ్రి కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న అత్తిలి ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిస్థాయిలో అదుపుచేసింది. తాటాకింట్లో రూ.60 వేల నగదు, సామగ్రి కాలి బూడిదైందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పశు వైద్యశాలలు.. అందని సేవలు

కాళ్లలో అపరిశుభ్రత, జువ్వలపాలెంలో పోస్టు ఖాళీ
ఇబ్బందుల్లో పశు పోషకులు

ప్రజాశక్తి - కాళ్ల

వ్యవసాయం గిట్టుబాటు కాని రైతులు దాని అనుబంధ రంగమైన పాడి పరిశ్రమను నమ్ముకొని పశు పోషకులు జీవిస్తున్నారు. పశువులు వ్యాధుల బారిన పడినప్పుడు పశువైద్యశాలల్లో పశువైద్యాధికారి, సిబ్బంది అందుబాటులో లేక పశుపోషకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాళ్ల, జువ్వలపాలెం పశువైద్య కేంద్రాల్లో పశువులకు వైద్య సేవలు అందడం లేదు. పశు వైద్యాధికారి, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సేవలను అందించలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


కాళ్ల పశు వైద్య కేంద్రం ఎదుట అపరిశుభ్రత

కాళ్ల పశువైద్య కేంద్రం ఆవరణలో అపరిశుభ్రత నెలకొంది. జువ్వలపాలెం పశువైద్య కేంద్రంలో ప్రతిరోజు వైద్య సేవలు నిర్వహించడం లేదు. ఈ నెల ఏడో తేదీన కేంద్రం మూసివేసి ఉంది. జువ్వలపాలెం గ్రామంలో గ్రామీణ పశువైద్యశాల ఉంది. జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల్లోని పశుపోషకులు పశు వైద్యం కోసం ఈ వైద్యశాలనే ఆశ్రయిస్తుంటారు. కరోనా సమయంలో పశువైద్యాధికారి అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి ఇన్‌ఛార్జి పశు వైద్యాధికారితో కొనసాగిస్తున్నారు. పూర్తి స్థాయి పశువైద్యాధికారిని నియమించకపోవడంతో వైద్యశాలను నిత్యం తెరవడం లేదు. పేరుకు మాత్రం డాక్టర్ పోస్టు ఉన్నప్పటికీ కాళ్ల డాక్టర్‌ను డిప్యూటేషన్‌గా నియమించారు.

అపరిశుభ్రత

కాళ్ల పశువైద్య కేంద్రం ఆవరణలో అపరిశుభ్రత నెలకొంది. ఈ పశువైద్య కేంద్రంలో పశువులకు వైద్య సేవలు సత్వరమే అందకపోవడంతో విలువైన పశువులు వ్యాధుల నుంచి కోలుకోవడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి జువ్వలపాలెంలో పూర్తిస్థాయి పశు వైద్యాధికారిని నియమించి మూగ జీవాలకు రక్షణతో పాటు తమ సంక్షేమానికి పాటుపడాలని పశు పోషకులు కోరుతున్నారు.

పశు పోషకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి

సరైన పశువైద్య సౌకర్యాలు ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో విలువైన మూగ జీవాలకు వైద్యం అందడంలేదు. దీంతో అవి మృత్యువాత పడుతున్నాయి. పశు పోషకులకు ఆర్థికంగా నష్టం జరుగుతుంది. ప్రభుత్వం సత్వరమే మృతి చెందిన జీవాలకు నష్టపరిహారం అందించి పశు పోషకుల సంక్షేమానికి కృషి చేయాలి.


మూసిఉన్న జువ్వలపాలెం పశు వైద్యశాల

రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి

జువ్వలపాలెం గ్రామంలో ఉన్న పశు వైద్యశాలకు పూర్తిస్థాయి డాక్టర్‌ను నియమించాలి. డాక్టర్ లేక పోషకులు ఇబ్బంది పడు తున్నారు. పశువులకు వ్యాధులు వస్తే ఆకివీడు వైద్యశాలకు వ్యయప్రయాసలకోర్చి తీసుకెళ్లాల్సి వస్తుంది. డాక్టర్ పోస్టును భర్తీ చేసి పశు వైద్యశాలల్లో పశువులకు నిత్యం వైద్యం అందించాలని రైతులు కోరుతున్నారు.

సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను
భార్గవి, కాళ్ల పశువైద్య ఇన్‌ఛార్జి అధికారి

కాళ్ల, జువ్వలపాలెం గ్రామాల్లో ఉన్న పశు వైద్య కేంద్రాల్లో ఇన్‌ఛార్జి పశువైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నాను. సిద్ధాపురం పశువైద్య కేంద్రంలో రెగ్యులర్, ఐ భీమవరం ఇన్‌ఛార్జి డాక్టర్‌గా పని చేస్తున్నాను. ఈ నెల నాలుగో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు కాళ్ల డాక్టర్ చంద్రబాబు సెలవు పెట్టడంతో ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహించాను. వైద్య సిబ్బంది విధులకు హాజరు రాలేదు. కాళ్ల పశు వైద్య కేంద్రంలో అపరిశుభ్ర పరిస్థితిని, జువ్వలపాలెం పశువైద్యకేంద్రాన్ని తెరవని పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

బాస్కెట్‌బాల్ జాతీయస్థాయి జట్టుకు సౌజన్య

ఏలూరు: జాతీయస్థాయి బాస్కెట్ బాల్ జట్టుకు పెదవేగి మండలం విజయరాయి పంచాయతీ కార్యదర్శి వలపుల సౌజన్య ఎంపికయ్యారు. ఈ నెల తొమ్మిదో తేదీన విజయవాడలో జరిగిన అఖిల భారత సివిల్ ఎంప్లాయిస్ స్టేట్ సెలెక్షన్స్‌లో సౌజన్య జాతీయస్థాయికి ఎంపికైంది. జాతీయస్థాయి క్రీడలు అక్టోబర్‌లో జరగనున్నాయి. జిల్లా నుంచి ఎంపికైన సౌజన్య రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా ఆమెను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ జి.పద్మశ్రీప్రసాద్, జిల్లా అధికారులు అభినందించారు. జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాసవిశ్వనాథ్ మాట్లాడుతూ సౌజన్య ఇటు విధుల్లోను, అటు క్రీడల్లోనూ రాణిస్తుందన్నారు.


సౌజన్యను అభినందిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

సెల్ టవర్ ఎక్కిన వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక బుధవారం మార్కెట్ కూడలిలో ఉన్న సెల్ టవర్‌ను ఎక్కిన పట్టణానికి చెందిన బి.వసంతరావుకు గాయాలయ్యాయి. ఆదివారం సాయంత్రం టవర్ పరిసరాల్లో ఎవరూ లేని సమయంలో అతను టవర్ ఎక్కి కేకలు వేయడంతో ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసు, అగ్నిమాపక అధికారులు అక్కడికి చేరుకుని అతడిని కిందకు దించారు. అతడు టవర్ ఎక్కే సమయంలో చేతికి గాయమవ్వడంతో వసంతరావును చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేర్చామని సిఐ శ్రీను తెలిపారు.


సెల్ టవర్‌పై వసంతరావు

ఘనంగా రామచంద్రయ్యనాయుడు జయంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

స్వాతంత్ర పోరాటంలో బ్రిటీష్ ప్రభుత్వాన్ని సాయుధ పోరాటం ద్వారా తరిమికొట్టిన గోదావరి జిల్లాల తెలుగు బిడ్డ, మన్యం యోధుడు ద్వారబందాల రామచంద్రయ్య నాయుడు జయంతి వేడుక పాలకొల్లు దాసరి కాంస్య విగ్రహ ఆవరణలో శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. జనసేన జిల్లా కార్యదర్శి బోనం వెంకటనరసయ్య, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వంగా నరసింహారావు, బిజెపి పట్టణ అధ్యక్షులు జక్కంపూడి కుమార్, యుకెసి అధ్యక్షులు గాది ఆంజనేయులు, సమితి సలహాదారులు గుగ్గిలపు ముత్యాలరావు పూల మాలలతో ఘనంగా నివాళులర్పించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షులు యర్రంశెట్టి వెంకటరత్నం మాట్లాడుతూ చరిత్ర విస్మరించిన స్వాతంత్ర్య సమరయోధుడు, స్ఫూర్తి ప్రదాత ద్వారబందాల రామచంద్రయ్యనాయుడు 163 సంవత్సరాల క్రితం ఇప్పటి విజయనగరం జిల్లా బొబ్బిలిలో ద్వారాబందాల లక్ష్మయ్యదొర, నర్సమ్మ దంపతులకు జన్మించారని చెప్పారు. రామచంద్రయ్యనాయుడు చదువు కన్నా కుస్తీ పోటీలు, కత్తి, కర్రసాములు, తుపాకీ వేటలో ఆరితేరి తెల్లవారు, వారి పాలెగాళ్లు చేసే అకృత్యాలు, అధికవడ్డీలపై ముఖ్యంగా హరిజన, గిరిజన ప్రాంతాల్లో అనాదిగా వస్తున్న కల్లు, సారాయి మీద కొత్తగా పన్నులు వేసి కట్టని వారిని చిత్రహింసలకు గురిచేస్తుంటే వీరి బాధలు పడలేక వలసలు పోతున్న అడవి బిడ్డలకు అండగా నిలబడి 1877 నుంచి 1879 వరకు ఏడు సార్లు బ్రిటీష్ ప్రభుత్వాన్ని తరిమికొట్టారన్నారు. ఒక సాయుధ దళాన్ని తయారు చేసుకొని బురద కోట స్థావరంగా పోరాట చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బోనం మునసబు, మండెల రజనీ, గుండుమోగుల వీరాస్వామి, యాదంరెడ్డి అప్పాజి, ఉనికెల శ్రీనివాస్, ఇనుకొండ కాశీ, లంకలపల్లి కనకరాజు, మద్దాల ముత్తాజీరావు, ఇనుకొండ శేషాద్రి, పశ్యావుల రవికుమార్, కొల్లి నర్సింహమూర్తి, మండెల పెద్ద, నార్ని మురళీకృష్ణ, మోహన్ పాల్గొన్నారు.


రామచంద్రయ్యనాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉన్నత భావాలు సమాజానికి స్ఫూర్తి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి, లయన్స్ సభ్యులు,

ప్రజాశక్తి - ఆకివీడు

వ్యక్తి ఉన్నత భావాలు సమాజానికి ఎంతగానో ఉపయోగ పడతాయని, అవి మరెంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని లయన్స్ ప్రముఖులు వివరించారు. స్థానిక ఆదర్శ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పడిన ఆకివీడు ఆదర్శ లయన్స్ సర్వీస్ ట్రస్ట్ నిర్వహణలో మోటుపల్లి రత్తయ్య సూర్యావతి ఆనంద నిలయం పేరుతో నడిపే వృద్ధాశ్రమం భవన నిర్మాణానికి ఆదివారం ట్రస్ట్ కార్యదర్శి గొంట్ల కృష్ణమూర్తి దంపతులు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంఎల్‌సి, లయన్స్ మాజీ గవర్నర్ వంకా రవీంద్రనాథ్, లయన్స్ జిల్లా ప్రస్తుత గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మోటుపల్లి సుబ్బారావు శ్రీని వాసు సోదరుల ఉన్నత భావాలు అందరికి స్ఫూర్తినిస్తున్నాయన్నారు. ఇటువ ంటి ఆశ్రమాలు సమాజంలో మరిన్ని అవస రమని ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ మల్టిపు ల్ ఛైర్మన్ (రాష్ట్ర అధ్యక్షులు) చిలువూరి కృష్ణంరాజు, మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవి.సూర్యనారాయణరాజు, లయన్స్ క్లబ్, ఆదర్శ లయన్స్ క్లబ్, అభయ లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, ఆర్‌ఎంలు, జిల్లా ఛైర్మన్లు, స్థానిక ప్రముఖులు, దాతలు పాల్గొన్నారు.

మూడు రోజులు 144 సెక్షన్

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో మూడు రోజుల పాటు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మదీనా బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్ట్ నేపథ్యంలో సభలు, సమావేశాలు జరపకూడదని, ప్రజలు గుంపుగా ఉండకూడదని తహశీల్దార్ దండు అశోక్ వర్మ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.


సముద్రంలో పర్యాటకుల సందడి

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటక, ప్రకృతి ప్రేమికులు సుదూర ప్రాంతాల నుంచి బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో అధిక సంఖ్యలో పర్యాటకులు బీచ్‌కి తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకువస్తున్న కెరటాలతో ఇసుక తెన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలు దర్శించుకుని సరివి కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు.

వెంకటాచార్యులుకు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు గ్రామానికి చెందిన ఆముదాలపల్లి వెంకటాచార్యులు జాతీయ పురస్కారం నంది అవార్డు, ప్రశంసపత్రం అందుకున్నారు. విజయవాడలోని విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ భవనంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు విభాగాల్లో సేవలందించిన ఆ సామాజిక తరగతికి చెందిన వారికి బహుమతులు ప్రదానోత్సవం చేశారు. దీనిలో భాగంగా ఉమ్మడి రాష్ట్రాల రాధా రంగా మిత్రమండలి అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీను, విశ్వబ్రాహ్మణ రాష్ట్ర ఛైర్మన్ తోలేటి శ్రీకాంత్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వెంకటాచార్యులను అభినందించారు.


జాతీయ అవార్డు అందుకున్న వెంకటాచార్యులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పెనుమత్స రంగరాజు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 1971-72 విద్య సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం అయ్యారు. 51 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదంగా గడిపారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు దశక సుబ్రహ్మణ్యం, రంగనాథచార్యులు, అప్పలరాజులతో పాటు పలువురిని ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేసేందుకు తీర్మానించారు. పాఠశాల అభివృద్ధికి విశాఖపట్నంలో స్థిరపడిన వ్యాపారవేత్త గాదె మోహన్‌రావు రూ.50 వేలు విరాళంగా అందించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ప్రిన్సిపల్ కెవిసిఎస్.అప్పారావు, ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త కె.ఆంజనేయులు, నేత్ర వైద్యులు అయితం ప్రకాష్, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి పి.విజయ్‌వెంకటేష్, అనంతపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.


గురువులతో పూర్వ విద్యార్థులు

'ఎస్ఆర్‌కెఆర్'లో నేడు ఓరియంటేషన్ డే

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 11వ తేదీ సోమవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ డే నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు తెలిపారు. ఈ ఓరియంటేషన్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, జెఎన్‌టియు కాకినాడ ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ, భీమవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ వివిఎస్‌ఎన్.వర్మ హాజరవుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా సీట్లు ఉన్న తమ కళాశాలలో పూర్తిస్థాయిలో కన్వీనర్ కోటాలో మొత్తం సీట్లు భర్తీ అయ్యాయని చెప్పారు. ప్రధానంగా కంప్యూటర్ ఆధారిత కోర్సులతో పాటు కోర్ గ్రూపులైన సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో కూడా పూర్తిస్థాయిలో భర్తీ అయ్యాయని వివరించారు. గతేడాది కోర్ గ్రూపులకు కూడా తమ కళాశాలలో ప్లేస్‌మెంట్స్‌లో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉద్యోగాలు పొందారని వెల్లడించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూడా పలు పరిశోధన కేంద్రాలు తమ కళాశాలకు మంజూరు చేశాయని చెప్పారు

శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దు

ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్

ప్రజాశక్తి - ఆకివీడు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్ట్ నేపథ్యంలో టిడిపి కార్యకర్తలు, అభిమానులు శాంతిభద్రతలకు భంగం కలిగించడం తగదని వైసిపి నాయకులు, శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం లయన్స్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇక్కడికి వచ్చిన ఆయన వైసిపి నాయకులు కేసిరెడ్డి మురళి నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజకీయాల్లో స్వచ్ఛత ఉండాలన్నారు. రాజకీయాల్లో ఆరోపణలు సహజమని, అయితే వాటిని నిరూపించుకుని బయట పడాలని అన్నారు. ఇది అంతిమ తీర్పు కాదని, ఆరంభమేనని, తప్పు చేయకపోతే అది కోర్టులో నిరూపించుకుని బయటికు రావచ్చని చెప్పారు. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. పంచాయతీ ఏర్పడిన అనంతరం సిబ్బంది లేరని తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. త్వరలో సిబ్బందిని నియమించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. నగర పంచాయతీ అభివద్ధికి తాను తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ పుప్పాల సత్యనారాయణ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, వైసిపి నాయకులు మోటుపల్లి గంగాధరరావు, కేశవరెడ్డి దిలీప్, ఎండి అలీ, అంబటి రమేష్, ఎండి.జిక్కీ పాల్గొన్నారు.

టిడిపి నేతలు సంయమనం పాటించాలి

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కోర్టు తీర్పును గౌరవించి టిడిపి నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు సూచించారు. ఆదివారం సాయంత్రం టిడిపి అధినేత చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించడంతో ఆయన నివాసం వద్ద రామరాజు మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు బెయిల్ వచ్చేవరకు నిరసన కొనసాగిస్తామన్నారు. జగన్ కక్ష సాధింపు చర్యల్లో భాగమే తప్ప మరొకటి కాదన్నారు. కనీసం 16 గంటలైనా జైలులో పెట్టాలని వైసిపి నాయకులు దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. చంద్రబాబు నాయుడు మచ్చలేని వ్యక్తి అని, బెయిల్ కోసం హైకోర్టుకు వెళ్తామని, అక్కడ తమకు న్యాయం జరుగుతుందని నమ్మకం ఉందని చెప్పారు.

'బిసిలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'

ప్రజాశక్తి - పోడూరు

బిసిలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ గణేష్‌భవాని పిలుపునిచ్చారు. పెనుమదంలో మండల స్థాయిలో జాతీయ బిసి సంక్షేమ సంఘం సమావేశం నియోజకవర్గ అధ్యక్షుడు పితాని చిన్న అధ్యక్షతత ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ గణేష్‌భవాని మాట్లాడుతూ బడుగు, బహుజన వర్గాలు రాజ్యాధికారం దిశగా పయనించాలని చెప్పారు. స్వాతంత్రం వచ్చి 76 ఏళ్లు గడిచినా బడుగు, బహుజన వర్గాల్లో ఆశించిన మార్పు రాలేదన్నారు. అగ్రకుల రాజకీయ పార్టీలు బడుగు, బహుజన వర్గాలను అభివృద్ధికి దూరం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, కులాల వారీగా జనాభా గణాన జరగాలని డిమాండ్ చేశారు. తొలుత చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షునిగా పితాని వెంకటన్‌ను, నరసాపురం డివిజన్ అధ్యక్షునిగా గుబ్బల సత్యనారాయణను, పాలకొల్లు నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షునిగా చింతపల్లి చరణ్‌ను, పోడూరు మండల యువజన విభాగం అధ్యక్షునిగా గుత్తుల వెంకట నాగరాజును, సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షునిగా కాంగ్రేకుల మణికంఠను, నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా దంపనబోయిన సాయికుమార్‌ను, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షునిగా గుబ్బల ఉదయభాస్కర్‌ను, పోడూరు మండల కార్యదర్శిగా దేవేందర్ గౌడ్‌ను నియమిస్తున్నట్లు గణేష్ భవాని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, మామిడి సత్యనారాయణ, వింజరాపు శంకరం, దప్పిడి నరసింహరాజు, కందికట్ల పరబ్రహ్మం, బిసి నాయకులు పాల్గొన్నారు.